
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
05-09-2025
పేజీలు: 02

## సామాన్యుడి నుండి అసాధారణ వ్యక్తిగా ఎదిగిన ముండ్రు ఫణీంద్ర

జీవితంలో ఎక్కడి నుంచి ప్రారంభమయ్యామన్నది ముఖ్యం కాదు... ఎక్కడికి చేరతామన్నదే మన విలువను నిర్ణయిస్తుంది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, విద్యార్థి దశ నుంచే కష్టపడుతూ, మూడు విభిన్న రంగాల్లో - సాఫ్ట్‌వేర్, ఆటోమొబైల్, మీడియాలలో తన ముద్ర వేసిన వ్యక్తి ముండ్రు ఫణీంద్ర. ఫణీంద్ర కథ కేవలం వ్యాపార విజయమే కాదు, పట్టుదలతో కలల్ని సాకారం చేసుకున్న ఒక నిజ జీవిత ఉదంతం. జీవితంలో సాధించాలన్న తపన, సాధించేవరకు ఆగని కృషి; ఈ రెండు గుణాలే తనను నేడు విశిష్టమైన వ్యక్తిని చేసాయి.



పూర్తి వివరాలు 3వ పేజీలో..

# లిటిల్ హార్ట్స్ సినిమా రివ్యూ

తమ తల్లిదండ్రులు కోరిన చదువులు చదవలేక, చదువు అంటే పెద్దగా ఆసక్తి లేని ఇద్దరు యువతీ యువతులు అఖిల్ (మౌళి తనూజ్ ప్రశాంత్) అలాగే కాత్యాయని (శివాని నాగారం) ఒక ఇన్స్టిట్యూట్ లో కోచింగ్ కి జాయిన్ అవుతారు. అక్కడ నుంచి ఇద్దరికీ జరిగిన పరిచయం తర్వాత వీరి పరిచయం ప్రేమగా ఎలా మారింది? ఆల్రెడీ ఒక బ్రేకప్ తర్వాత కాత్యాయనిని ప్రేమించిన అఖిల్ ఆమె విషయంలో తెలుసుకున్న ఓ షాకింగ్ నిజం ఏంటి? వాళ్ళ తల్లిదండ్రులు వీరి ప్రేమని అంగీకరించారా లేదా? ఇంకోపక్క వీళ్ళ చదువులు ఏమయ్యాయి అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. 90స్ బయోపిక్ ఇంకా మౌళి విషయంలో మినిమమ్ అవగాహన మన తెలుగు యువతకి ఇపుడు బాగానే ఉండి ఉంటుంది. వారిని అయితే మౌళి ఎక్కడా డిజప్పాయింట్ చేయడని చెప్పాలి. తన సిల్వర్ స్క్రీన్ డెబ్యూ చాలా డీసెంట్ అండ్ ఫన్నీగా ఉందని చెప్పాలి. తన నుంచి సాలిడ్ కామెడీ టైమింగ్ ఈ సినిమాలో బాగా వర్కౌట్ అయ్యింది. ముఖ్యంగా సెకండాఫ్ లో తనపై ఓ సాంగ్ ఎపిసోడ్ అయితే మంచి హిలేరియస్ గా వర్కౌట్ అయ్యిందని చెప్పాలి. అలాగే తనకి జోడిగా నటించిన యంగ్ హీరోయిన్ శివాని నాగారం అంబాజీపేట మ్యారేజి బ్యాండు తర్వాత తనకి సూటయ్యే మరో రోల్ ని ఎంచుకుంది. ఇందులో ఆమె పర్ఫెక్ట్ గా కనిపించడమే కాకుండా పలు టైం లైన్స్ తగ్గట్టుగా ఆమె తన లుక్స్ ఇంకా నటనతో ఇంప్రెస్ చేస్తుంది. ఇక వీరితో పాటుగా మౌళి తోనే కనిపించే మరో యువ నటుడు జై కృష్ణ మరో ఎసెట్ అని చెప్పాలి. సాలిడ్ కామెడీ టైమింగ్ అండ్ మంచి నటనతో ఈ యువ నటుడు ఆకట్టుకున్నాడు. ఫస్టాఫ్ సెకండాఫ్ లలో తనపై పలు కామెడీ సీన్స్ వర్కౌట్ అయ్యాయి. ఇక వీరితో పాటుగా సీనియర్ నటులు రాజీవ్ కనకాల తన రోల్ లో అదరగొట్టారు. తన కొడుకు చదువు విషయంలో ఆరాట పడే తండ్రిగా కుటుంబ పెద్దగా మంచి రోల్ లో కనిపించారు. అలాగే నటుడు ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్ లు తమ పాత్రల్లో బాగా చేశారు. ఇక వీటితో పాటుగా కథనం సెకండాఫ్ లో బెటర్ గా అనిపించింది. పెద్దగా బోర్ లేకుండా పాత రోజులు గుర్తు చేసేలా మంచి కామెడీ మూమెంట్స్ సినిమా సాగింది అని చెప్పవచ్చు. ఈ సినిమాలో బలమైన స్టోరీ లైన్ అయితే లేదు చాలా సింపుల్ లైన్ నే అందరికీ తెలిసిన దానినే అలా ఫన్ సీన్స్ తో లాగించేసారు. సో మరీ కొత్తదనం కోరుకునేవారు ఈ సినిమా విషయంలో డిజప్పాయింట్ అవుతారు. అలాగే అక్కడక్కడా కథనం ఒకింత సాగదీత ఫీల్ కలుగుతుంది. అలాగే కామెడీ సీన్స్ కొన్ని బాగానే ఉన్నప్పటికీ రిపీటెడ్ గా అనిపిస్తాయి సో వాటితో కొంచెం అక్కడక్కడా మాత్రం ల్యాగ్ అనిపించవచ్చు. అలాగే సినిమా టైం లైన్ ఒక పదిహేనేళ్ల వెనక నుంచి తీసుకున్నారు కానీ టెక్నికల్ గా ఆ టైం డీటెయిల్స్ మిస్ అయినట్టు కూడా అనిపిస్తుంది. అలాగే కథనం కూడా చాలా వరకు ఊహాజనితంగానే కనిపిస్తుంది. సో మరీ ట్విస్ట్ లు టర్న్ లు లాంటివి కూడా ఈ సినిమా నుంచి ఆశించకుండా ఉంటే మంచిది. అలాగే సినిమాలో మొత్తం కామెడీకే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది సో మంచి ఎమోషన్స్ లాంటివి ఫ్యామిలీ విషయంలో కోరుకునేవారికి ఈ చిత్రంలో అంతగా కనిపించవు. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు బాగున్నాయి. ఆదిత్య హాసన్ పెట్టుకున్న బడ్జెట్ కి తగ్గట్టుగా డీసెంట్ ప్రొడక్షన్ డిజైన్ తో సినిమాని బాగానే ప్లాన్ చేసుకున్నారు. శింజిత్ యర్రమిల్లి ఇచ్చిన సంగీతం బాగుంది. పాటలు, స్కోర్ డీసెంట్ గా ఉన్నాయి. సూర్య బాలాజీ సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. శ్రీధర్ సోంపల్లి ఎడిటింగ్ ఇంకొంచెం బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు సాయి మార్తాండ్ విషయానికి వస్తే.. తన వర్క్ ఈ చిత్రానికి ఓకే అని చెప్పొచ్చు. స్ట్రాంగ్ ఎమోషన్స్ లేకపోయినప్పటికీ కామెడీ ట్రాక్స్ వరకు తాను బాగా రాసుకున్నారు. కానీ మిగతా అంశాలు అన్నీ చాలా సింపుల్ గానే నడిపించేసారు. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే ఈ "లిటిల్ హార్ట్స్" ఒక డీసెంట్ టైం పాస్ కామెడీ ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. మౌళి ఒక డీసెంట్ డెబ్యూ ఇవ్వగా తన కామెడీ ట్రాక్స్, హీరోయిన్ తో లవ్ ట్రాక్ లు బాగున్నాయి. ముఖ్యంగా యువతకి ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుంది. లాజిక్స్, ఎమోషన్స్ తో పెద్దగా పని లేదు కేవలం ఫన్ కోసం మాత్రమే అంటే ఈ చిత్రాన్ని ట్రై చేస్తే ఎంటర్టైన్ అవుతారు.







## లోయలో పడిన బస్సు: 15 మంది మృతి

శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎల్లా-వెల్లవాయ ప్రధాన రహదారిపై మినీ బస్సు అదుపుతప్పి లోయలో పడిపోవడంతో 15 మంది మృతి చెందగా 18 మందికి తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని బదుళ్ల బోధనాస్పత్రికి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతులలో ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. ఎల్లా-వెల్లవాయ ప్రధాన రహదారిపై 24వ కిలోమీటర్ మూల మలుపు వద్ద బస్సు అదుపుతప్పి 500 మీటర్ల లోతుగల లోయలో పడిపోయింది. మున్సిపల్ కౌన్సిల్‌కు చెందిన 30 మంది ఉద్యోగులు ఎల్లాలో విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

# మదరాసి రివ్యూ



ఈ వారం థియేటర్స్ లో రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో కోలీవుడ్ అవైటెడ్ చిత్రం 'మదరాసి' కూడా ఒకటి. శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్ గా మురుగదాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఎలా ఉందో సమీక్షలో చూద్దాం రండి. తన చిన్నతనంలోనే ఒక యాక్సిడెంట్ లో కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్న రఘు (శివ కార్తికేయన్) ఆ ఘటనతో డిల్యూషన్ సిండ్రోమ్ కి గురవుతాడు. ఇలా 16 ఏళ్ళు ట్రీట్మెంట్ తర్వాత తన లైఫ్ లోకి మాలతి (రుక్మిణి వసంత్) వస్తుంది. ఇంకో పక్క ఇద్దరు ఫ్రెండ్స్ చిరాగ్ (షబీర్), విరాట్ (విద్యుత్ జమ్వాల్) లు మొత్తం చెన్నైని గన్స్ తో నింపాలని పెద్ద ప్లాన్ చేస్తారు. ఇది ఎన్ ఐ ఏ వారికి పెద్ద సవాలుగా మారుతుంది. ఇలా ఎన్ ఐ ఏ అధికారి ప్రేమ్ (బిజు మీనన్) తన బృందంతో ఆ గన్ కల్చర్ ని ఆపాలని ట్రై చేసే మిషన్ లోకి రఘు ఎలా ఎంటర్ అయ్యాడు? తన ప్రేయసి కోసం రఘు ఏమేం చేసాడు? ఈ గన్ మాఫియా వెనుక ఉన్నది ఎవరు? ఆ గన్ లోడ్ బయటకి రాకుండా ఆపారా లేదా అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. ఈ సినిమాలో బాగా ఇంప్రెస్ చేసే అంశాల్లో హీరో శివ కార్తికేయన్ కోసం మొదటిగా చెప్పుకోవాలి. తను అమరన్ లాంటి బిగ్ హిట్ తర్వాత ఇలాంటి ఒక ఊహించని పాత్రని ఎంచుకోవడం ఒకింత ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

ఇది వరకు వచ్చిన సినిమాలు అన్నిటికంటే బహుశా రెమో తర్వాత నటుడుగా తన నుంచి ఒక సాలిడ్ రోల్ ఇది అని చెప్పొచ్చు. నటుడిగా ఈ సినిమాలో కొత్త వెర్షన్ ని తన నుంచి చూడవచ్చు. అలాగే తనపై ఫస్టాఫ్ లో ఎమోషన్స్ కానీ ఫుల్ మూవీ లో యాక్షన్ పార్ట్ కాని సాలిడ్ గా వర్కౌట్ అయ్యాయి. ఇక తనతో పాటుగా విద్యుత్ కి సాలిడ్ రోల్ దక్కింది. మొదట్లో కొంచెం సోసో గానే అనిపిస్తుంది కానీ సెకాండఫ్ లో మాత్రం మురుగదాస్ మళ్లీ తుపాకీ రేంజ్ ఫేస్ట్ తనపై అందించాడు. విద్యుత్ రోల్ కోలుకున్న తర్వాత నుంచి సినిమా మూమెంటం మారింది. ఇక వీరితో పాటుగా డాన్సింగ్ రోజ్ ఫేమ్ షబీర్ కి మంచి పాత్ర దక్కింది. తన నటనా యాక్షన్ పెర్ఫామెన్స్ లు బాగున్నాయి. అలాగే హీరోయిన్ రుక్మిణీ వసంత్ కి సినిమాలో మంచి రోల్ దక్కింది. దాదాపు తనకోసమే అన్నట్టు సినిమా కూడా ఉంటుంది. తన రోల్ కి ఆమె న్యాయం చేసింది. ఇక వీరితో పాటుగా బిజూ మీనన్, పి సీ 2 గా కనిపించిన నటుడు తదితర ప్రధాన తారాగణం బాగా నటించారు. మురుగదాస్ నుంచి చాలా కాలం తర్వాత వచ్చిన సినిమా ఇది అయినప్పటికీ తన వంతు కొత్తగా అన్నట్టు ఏదో ట్రై చేశారు కానీ అదేమీ అంత కొత్తగా కనిపించదు. ఈ మధ్య కాలంలో పలు సినిమాల్లో చూపిస్తున్న గన్ కల్చర్ కాన్సెప్ట్ కి తన స్టైల్ హీరో పాత్ర దానికో లోపం పెట్టి అక్కడక్కడా తన పాత సినిమాలు స్టైల్ లోనే కథనం నడిపించారు. అలాగే యాక్షన్, ఎమోషనల్ పార్ట్ కూడా కొంత మేరకు ఓకే అనిపిస్తుంది ఫుల్ ఫ్లెడ్జ్ గా ఆకట్టుకోలేదు. కొన్ని చోట్ల ఇవి ఫోర్స్డ్ గా కొన్ని చోట్ల నాచురల్ గా అనిపిస్తాయి. సో వీటితో తన నుంచి సాలిడ్ ట్రీట్ ని ఆశించే వారికి కొంచెం మిక్స్డ్ ఫీల్ కలుగుతుంది. అలాగే సెకాండఫ్ లో కథనం కూడా అంత ఎంగేజింగ్ గా సాగలేదు. దాదాపు 40 నిమిషాల వరకు కథనం రెగ్యులర్ గా సాగుతుంది. సో ఇక్కడ సాగదీత ఫీల్ కలుగుతుంది. అలాగే పాటలు కూడా ఒకటీ రెండు తప్ప అంత ఇంప్రెసివ్ గా లేవు పైగా ఎక్కువగా కూడా ఉన్నట్లు అనిపిస్తాయి. ఈ సినిమాలో నిర్మాణ విలువలు బాగున్నాయి. మేకర్స్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా కోసం ఖర్చు పెట్టారు. అనిరుద్ సంగీతం మరీ కాదు కాని కానీ బానే ఉంది. సెకాండఫ్ లో కొన్ని సీన్స్ కి మంచి స్కోర్ ఇచ్చాడు. సుదీప్ ఎలమన్ ఇచ్చిన కెమెరా వర్క్ బాగుంది. కెవిన్ కుమార్ యాక్షన్ పార్ట్ ఇంప్రెస్ చేస్తుంది. తెలుగు డబ్బింగ్ కూడా డీసెంట్ గా ఉంది. ఇక దర్శకుడు ఎ ఆర్ మురుగదాస్ విషయానికి వస్తే.. తన వర్క్ అంచనాలు అందుకునే రీతిలో లేదని చెప్పక తప్పదు. ఈ మధ్య కాలంలో స్టార్ట్ అయ్యిన గన్ కల్చర్ కాన్సెప్ట్ తీసుకొని హీరోకి ఒక లోపాన్ని పెట్టి లవ్, యాక్షన్ మిక్స్ చేసి ప్లాన్ చేసిన ఈ సినిమా ఫుల్ ఫ్లెడ్జ్ గా తన మార్క్ లో సాగలేదు. కొన్ని చోట్ల ఇంప్రెస్ చేస్తే కొన్ని చోట్ల కథనం ఫోర్స్డ్ గా సాగుతుంది. అలాగే సినిమాకి మదరాసి అనే టైటిల్ ఎందుకు పెట్టారో తనకే తెలియాల్సి ఉంది. ఓవరాల్ గా తన ఫుల్ ఫ్లెడ్జ్ కంబ్యాక్ అయితే ఇంకా తర్వాతే చూడాలి.



## భార్యతో అక్రమ సంబంధం.. సోదరుడిని చంపి 10 అడుగుల గుంత తీసి పాతిట్టాడు

తన భార్యతో అక్రమ సంబంధం(Affair With Wife) పెట్టుకున్నాడన్న అనుమానంతో సోదరుడిని చంపేశాడు. మృతదేహాన్ని ఓ క్వారీలో 10 అడుగుల గుంత తీసి పూడ్చిపెట్టాడు. గత నెల 27న రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగౌర్‌లోని భవండాకు చెందిన సోహన్‌రామ్ (29) తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తనకు సోదరుడు వసురసయ్యే ముకేశ్ గల్వా అనే వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నదని అనుమానిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 27న ముకేశ్‌ను సమీపంలోని భట్‌నోక్హా గ్రామంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలు చూసొద్దామని తీసుకెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు ఇద్దరు అక్కడే ఉన్నారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అక్కడి నుంచి బయల్దేరారు. నిర్మానుశ్య ప్రదేశానికి అతడిని తీసుకెళ్లి.. ఇనుప రాడ్డుతో చచ్చేవరకు కొట్టాడు. అనంతరం తన క్వారీలో బుల్డోజర్‌తో 10 అడుగుల లోతు గుంత తీసి ముకేశ్‌ను పాతిపెట్టాడు. ఎవరూ గుర్తించకుండా బొందపై పెద్దపెద్ద బండరాళ్లు పెట్టేశాడు. అనంతరం ఏమీ తెలియనట్లుగా గ్రామానికి తిరిగి వచ్చాడు. అయితే ముకేశ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పలువురిని విచారించగా సోహన్‌రామ్ పేరు చెప్పడంతో.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో అడగడంతో అసలు విషయం చెప్పాడు. దీంతో సోహన్‌రామ్‌పై హత్య కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. క్వారీలో నుంచి ముకేశ్ మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టు మార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.



## యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు సబలెంక

డిఫెండింగ్ చాంపియన్, బెలారస్ స్టార్ ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంక వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. నువ్వా నేనా అన్నట్లుగా జరిగిన సెమీఫైనల్‌లో జెస్సికా పెగులాపై 4-6, 6-3, 6-4 తేడాతో విజయం సాధించింది. తొలి రౌండ్‌తో 4-6తో కోల్పోయినప్పటికీ పట్టు విడవకుండా ఆడిన సబలెంత తర్వాతి రెండు రౌండ్లలో విజయం సాధించి.. మరోసారి ట్రోఫీని దక్కించుకోవడానికి ముందడుగు వేసింది. దీంతో శనివారం జరుగనున్న ఫైనల్‌లో 8వ సీడ్ అమాండా అనిసిమోవా లేదా 23వ సీడ్ నవోమీ ఒసాకాతో తలపడనుంది. ఈ ఏడాది ఇప్పటికే మూడు టైటిళ్లు సాధించిన సబలెంకా, ఓవరాల్‌గా 19 టైటిళ్లు సొంతం చేసుకున్నది. ఫైనల్‌లో గెలిస్తే సెరెనా విలియమ్స్ తర్వాత యూఎస్ ఓపెన్‌ను వరుసగా గెలుచుకున్న తొలి క్రీడాకారిణిగా నిలువనుంది. సెరెనా 2012 నుంచి 2014 వరకు వరుసగా మూడు సార్లు యూఎస్ ఓపెన్‌ను చేజిక్కించుకున్నది.

02 EVENING EDITION
శుక్రవారం | 05 సెప్టెంబర్ 2025 4 PM
www.suryaa.com
నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4 PM
www.suryaa.com




## బిగ్ బాస్‌లోకి ఆరుగురు కామన్ మ్యాన్స్

తెలుగు టెలివిజన్ చరిత్రలో బిగ్గెస్ట్ రియాలిటీ షోగా గుర్తింపు పొందిన బిగ్ బాస్ ఇప్పుడు 9వ సీజన్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎనిమిది సీజన్లు సూపర్ సక్సెస్ కావడంతో ఈసారి మరింత గ్రాండ్‌గా, కొత్త ఫార్మాట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్టార్ మా ఛానల్ సెప్టెంబర్ 7 నుండి ఈ షో ప్రసారమయ్యేలా ఏర్పాట్లు చేస్తుంది. ఈ సీజన్‌లో ప్రత్యేకత ఏమిటంటే, సెలబ్రిటీ కంటెస్టెంట్లతో పాటు కామన్ మాన్స్‌కి ఈ కూడా అవకాశం కల్పించారు. ఇందుకోసం 'అగ్ని పరీక్ష' అనే ప్రత్యేక గేమ్ షో నిర్వహించారు. అందులో పాల్గొన్న 45 మంది నుంచి మొదట 15 మందిని ఎంపిక చేశారు. తర్వాత వారి నుంచి మొదటగా ఐదుగురు హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్టు ప్రకటించినా, తాజా సమాచారం ప్రకారం ఆరుగురు కామన్ కంటెస్టెంట్లు బిగ్ బాస్ హౌస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

బిగ్ బాస్ సీజన్ 9 కామన్ కంటెస్టెంట్ల లిస్ట్:

**దమ్ము శ్రీజ**
అగ్ని పరీక్షలో ప్రతి టాస్క్‌ను చాలా తెలివిగా ఆడిన శ్రీజ, మొదటగా ఎంపికైన కంటెస్టెంట్. ఆత్మవిశ్వాసం, ఫైటింగ్ స్పిరిట్ ఆమె ప్రధాన బలాలు.

**మాస్క్ మ్యాన్ హరీష్**
టాస్క్ లలో తన విలక్షణమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్న హరీష్, తన అసలైన వ్యక్తిత్వాన్ని చూపించడంలో స్పష్టంగా ముందుండటం వల్ల ఎంపికయ్యాడు.

**ఆర్మీ పవన్ కళ్యాణ్**
సినీ ఇండస్ట్రీపై ఉన్న ఆసక్తితో తన ఉద్యోగాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధమైన ఈ యువకుడు, కమిట్‌మెంట్ కారణంగా సెలెక్ట్ అయ్యాడు.

**ప్రియ శెట్టి**
గేమ్‌లో తగిన కాంపిటీషన్ ఇస్తుందని భావించిన నిర్వాహకులు, ఆమెను ఎంపిక చేశారు. ఆమెకి గేమ్ పైన పట్టుదల ఉండడం గమనార్హం.

**మర్యాద మనీష్**
టాస్క్ గెలవడానికైతే ఏదైనా చేస్తాడు అనే లక్షణం ఉన్న మనీష్‌ను హౌస్‌లో ఆసక్తికరమైన ఆటగాడిగా భావిస్తున్నారు.

**హీ మ్యాన్ పవన్**
శారీరకంగా ఫిట్‌నెస్, గేమ్ పైన దృఢమైన అంకితభావంతో ఉన్న పవన్, చివరిగా ఎంపికైన కామన్ కంటెస్టెంట్.

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్



ఈనెల 6వ తేదీ నిమజ్జనం సందర్భంగా పలు రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 7వ తేదీ సాయంత్రం వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నారు. ప్రధానంగా బాలాపూర్ నుంచి కట్టమైసమ్మ టెంపుల్, గుర్రం చెరువు, చార్మినార్, మదీన, అఫ్జల్‌గంజ్, ఎస్ఏ బజార్, ఎంజే మార్కెట్, ఆబిడ్స్, బషీర్‌బాగ్ లిబర్టీ మీదుగా ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ నుంచి సంగీత్, ప్యాట్నీ, ప్యారడైజ్ తదితర ప్రాంతాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఎర్రగడ్డ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ మీదుగా ట్యాంక్ బండ్ వైపునకు చేరుకుంటాయి. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుకు ఇతర వాహనాలను అనుమతించరు. కూకట్‌పల్లి నుంచి మాదాపూర్ వైపు వచ్చే వాహనాలను జేఎన్‌టీయూ మీదుగా మాదాపూర్ వైపు మళ్లిస్తారు. హైటెక్ సిటీ నుంచి కూకట్‌పల్లి వెళ్లే వాహనాలను రెమిడీ ఆస్పత్రి వైపు పంపుతారు. ప్రగతి నగర్‌లో శ్రీనివాస స్టీల్స్ నుంచి మూడు కోతుల బొమ్మవరకు రోడ్డును మూసివేస్తారు. గండిమైసమ్మ నుంచి బాలానగర్ వైపుకు వెళ్లే వాహనాలను బహదూర్‌పల్లి జంక్షన్ వద్ద మళ్లిస్తారు. గచ్చిబౌలి నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలను ఎగ్జిట్ 17 నుంచి దారి మళ్లిస్తారు.



## కేరళలో ఘనంగా ఓనం వేడుకలు

కేరళ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ ఓనం (Onam). ఈ పండుగ మలయాళీలకు అత్యంత ప్రీతిపాత్రమైనది. ఆగస్టు-సెప్టెంబర్ నెలలో వచ్చే ఈ పండుగను పది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకుంటుంటారు. ఈ ఏడాది కూడా కేరళ వాసులు ఓనం వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. గత నెల 26న ప్రారంభమైన ఈ ఓనం వేడుకలు నేటితో (సెప్టెంబర్ 5) ముగియనున్నాయి. చివరి రోజు మలయాళీలు ఈ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు. మహిళలు కసావు స్టైల్ చీరకట్టులో మెరిసిపోయారు. బంధువులు, ఫ్రెండ్స్‌తో కలిసి ఓనసద్యా విందు ఆరగించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

# ఘాటి సినిమా రివ్యూ




అరుంధతి, సరోజా, దేవసేన, రుద్రమదేవి, భాగమతి.. ఇవన్నీ అనుష్క కెరీర్‌లో మైలురాయి లాంటి పాత్రలు. వేదం సినిమాలో సరోజా లాంటి ఐకానిక్ పాత్రని ఇచ్చిన క్రిష్‌తో స్వీటీ మరోసారి చేతులు కలిపి 'ఘాటి' తో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఘాటీలో శీలావతి తన కెరీర్‌లో మరో మైలురాయిలాంటి పాత్ర అవుతుందని నమ్మకంగా చెప్పింది స్వీటీ. మరి ఆ నమ్మకం నిజమైయిందా? వేదం మ్యాజిక్ రిపీట్ అయ్యిందా? ఇంతకీ ఈ ఘాటి కథేమిటి? ఇదంతా రివ్యూల్లో చూద్దాం. కథ: ఆంధ్ర-ఒడిశా బోర్డర్స్. అక్కడి తూర్పు కనుమల్లో కుందుల నాయుడు (చైతన్య రావు), కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్) గంజాయి మాఫియా సాగిస్తుంటారు. ఘాటీలుగా పిలవబడే స్థానిక ప్రజలు ఈ ఇద్దరి గుప్పెట్లో ఉంటూ గంజాయి రవాణా చేస్తుంటారు. అదే ప్రాంతంలో వుండే శీలావతి (అనుష్క), దేశీ రాజు (విక్రమ్ ప్రభు) ఆ పనికాకుండా వేరే పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతుంటారు. కానీ అనుకోని పరిస్థితులు వలన తిరిగి మళ్లీ గంజాయి స్మగ్లింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. వారు ఎందుకు మళ్ళీ స్మగ్లింగ్ చేయాల్సి వచ్చింది? ఈ క్రమంలో ఎలాంటి పోరాటం చేశారనేది మిగతా కథ. విశ్లేషణ: దర్శకుడు క్రిష్ ఎంచుకున్న సెటప్ బలంగా ఉంది. ఘాటి కమ్యూనిటీ నేపథ్యం కొత్తదనాన్ని తెస్తుంది. గంజా మాఫియా, స్థానిక ఘాటీల చుట్టూ తిరిగే ఫస్ట్ నెమ్మదిగా సాగినప్పటికీ కథలో తీవ్రతని పెంచగలిగింది. ఆంధ్ర — ఒడిశా ఈస్టర్న్ ఘాట్స్ నేపథ్యంలో కథ నడవడం ఫ్రెష్‌నెస్ తీసుకొచ్చింది. మంచి ఇంటర్వెల్ బ్లాక్ కుదిరింది. సెకండ్ హాఫ్ దేశీ రాజు,శీలావతి బ్యాక్‌స్టోరీలో ఎమోషన్ వర్క్ అవుట్ అయ్యింది. ఆ తర్వాత కథ రివెంజ్ డ్రామాగా మారిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ రివెంజ్ ట్రాక్ ఆడియన్స్ ఎంగేజ్ చేయగలిగింది. క్రిష్ రాసిన కొన్ని సీన్లు ఇంపాక్ట్ కలిగించాయి. అయితే సినిమా క్లైమాక్స్ కి చేరుకునే కొద్ది ట్రీట్మెంట్ రొటీన్ గా మారిపోతుంది. స్క్రీన్ ప్లే ఊహకు అందిపోయేలా సాగుతుంది. క్రిష్ బలం బలమైన ఎమోషన్స్ ని పలికించడం. కానీ ఇందులో పాత్రల్లో వుండే ఎమోషన్స్ అంతగా పైకి రాలేదు. కాకపోతే గంజాయి వలన కలిగే పర్యవసానాలు చూపించిన తీరు సందేశాత్మకంగా వుంటుంది. అనుష్క స్ట్రాంగ్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆమె అభిమానులకు నచ్చుతుంది. నటీనటులు నటన: శీలావతి పాత్రలో అనుష్క ఒదిగిపోయింది. ఎమోషనల్ సీన్స్‌లో మెప్పించిన స్వీటీ యాక్షన్ సన్నివేశాల్లో అదేస్థాయిలో అదరగొట్టింది. క్రిష్ శీలావతి పాత్రకి ఇచ్చిన ఎలివేషన్స్ బావున్నాయి. శీలావతి పాత్ర అనుష్క అభిమానులకు గుర్తిండిపోతుంది. ఈ స్థాయిలో యాక్షన్ చేయడం స్వీటీకి ఇదే ఫస్ట్ టైం. దేశిరాజు పాత్రలో విక్రమ్ ప్రభు డీసెంట్‌గా చేశాడు. ఫస్ట్ హాఫ్ తన చుట్టూనే తిరుగుతుంది. ఈ రెండు కూడా హై ఇంటెన్స్ వున్న పాత్రలే. కుందులు నాయుడు పాత్రలో చైతన్యరావు కొత్త విలనిజం పంచాడు. నిజానికి ఇలాంటి పాత్రలో చైతన్య కనిపించడం ఫ్రెష్‌నెస్ తీసుకొచ్చింది. జగపతిబాబు తినే మ్యానరిజం అంతగా కుదరలేదు. రవీందర్ విజయ్ తో పాటు మిగతా పాత్రలు కూడా కథకు తగ్గట్టుగానే ఉన్నాయి. టెక్నికల్‌గా: మనోజ్ కెమరావర్క్ సినిమాకి ప్లస్ అయ్యింది. తూర్పు కనుమల్లో చిత్రీకరించిన సన్నివేశాలు ఓ కొత్త అనుభూతిని పంచాయి. నేచర్‌ని తన కెమరా చక్కగా ఒడిసిపట్టుకుంది. సాగర్ పాటలు గుర్తుండవు కానీ నేపథ్య సంగీతం మాత్రం ఇంటెన్స్‌గా చేశారు. యాక్షన్ సీన్స్‌లో తన బీజీఎం హైలైట్ అయ్యింది. సాయి మాధవ్ బుర్రా రాసిన మాటలు కొన్ని ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉన్నాయి. ఫస్ట్‌ఫ్రేం, యువీ క్రియేషన్స్ నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి.




సెప్టెంబరు 6,7 తేదీల్లో నిమజ్జనాలు ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ వైపు వెళ్లే

## ప్రధాన మార్గాలు మూసివేత

నవరాత్రుల పాటు అంగరంగ వైభవంగా పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరే సమయం ఆసన్నమైంది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు ఘట్టమైన గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ మహానగరంలో పోలీసులు సెప్టెంబరు 6, 7 తేదీల్లో భారీ ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించారు. దాదాపు 28 గంటల పాటు నగరంలోని కీలక మార్గాలలో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సాఫీగా సాగేందుకు, అదే సమయంలో సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ యంత్రాంగం వెల్లడించింది. ఈ సమయంలో నగరవాసులు పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నగరం నలుమూలల నుంచి విగ్రహాలు హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలిరానున్నాయి. ఇందులో అత్యంత ప్రధానమైన బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ్ వైపు సాగుతుంది. అదేవిధంగా, సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకి, మెహిదీపట్నం, లక్డీకాపూల్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రధాన మార్గాలన్నింటిలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు.నగరంలోని వివిధ జోన్లలో ట్రాఫిక్‌ను భారీగా మళ్లించనున్నారు. ముఖ్యంగా సౌత్ ఈస్ట్ జోన్‌లో కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఇతర మార్గాల వైపు పంపిస్తారు. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ వంటి రద్దీ ప్రాంతాలలో కఠినమైన ఆంక్షలు ఉంటాయి. అదేవిధంగా, లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లను పూర్తిగా మూసివేస్తారు. నార్త్ జోన్‌లో పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ చౌరస్తాలలో ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తారు.విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఔటర్ రింగ్ రోడ్ మార్గాన్ని మాత్రమే ఉపయోగించాలని పోలీసులు సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలనుకునే వారు బేగంపేట, పారడైజ్ మార్గాన్ని ఎంచుకోవడం సురక్షితం. అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు మళ్లిస్తారు.

## వెంకటాపూర్‌లో పెద్దపులి సంచారం



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో పెద్దపులి సంచారం కలకలం సృష్టించింది. సింగరకొండపల్లి, కేశవాపూర్, నర్సాపూర్ శివార్లలో పెద్దపులి తిరుగుతున్నది. దీంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. పొలాల వద్దకు వెళ్లకూడదని చెప్పారు. పులిని గుర్తించేందుకు ఆయా గ్రామాల్లో ట్రాప్ కెమరాలను ఏర్పాటు చేశామని, దాని కదలికలను గుర్తిస్తున్నామని వెల్లడించారు.



## రాశి అందాలు

సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పా ల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. 14 ఏళ్ల వయసు లోనే ఓ కమర్షియల్ యాడ్ లో నటించిన ఈ భామ.. మొదట ఎయిర్ హోస్ట్ గా కెరీర్ ను ప్రారంభించింది. ఆ తర్వాత హైదరాబాద్ లో ఉద్యోగం చేసుకుంటూ నటన మీద ఉన్న మక్కువతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. 'జెమ్' సినిమాతో తెలుగు తెరకు పరిచమైయన ఈ బ్యూటీ ఆది సాయికుమార్ తో 'శశి' చిత్రంతో గుర్తింపు పొందింది. పోస్టర్, ప్రేమ్ కుమార్ వంటి చిత్రాల్లో అలరించింది. ఈ మధ్య కాలంలో 'భూతద్దం భాస్కర్ నారాయణ'లోనూ మెప్పించింది. ఇది ఇలా ఉంటే రీసెంట్ గా 'ప్రసన్నవద నం, బ్లైండ్ స్పాట్ 'తో ఆడియన్స్ ను పలకరించింది రాశి సింగ్. అయితే మూవీల్లో అంతగా అవకాశాలు రాకపోయినా ఫ్యాన్స్ తో మాత్రం టచ్లోనే ఉంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే రాశి.. ఎప్ప టికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్ లతో ఆకర్షిస్తుంది. చీరలు, మోడరన్ డ్రెస్సుల్లో ఆమె ఫొటోలు తరచూ వైరల్ అవుతుంటాయి.

# సామాన్యుడి నుండి అసాధారణ వ్యక్తిగా ఎదిగిన

# ముండ్రు ఫణీంద్ర



**జీవితంలో ఎక్కడి నుంచి ప్రారంభమయ్యామన్నది ముఖ్యం కాదు... ఎక్కడికి చేరతామన్నదే మన విలువను నిర్ణయిస్తుంది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, విద్యార్థి దశ నుంచే కష్టపడుతూ, మూడు విభిన్న రంగాల్లో - సాఫ్ట్‌వేర్, ఆటోమొబైల్, మీడియాలలో తన ముద్ర వేసిన వ్యక్తి ముండ్రు ఫణీంద్ర. ఫణీంద్ర కథ కేవలం వ్యాపార విజయమే కాదు, పట్టుదలతో కలల్ని సాకారం చేసుకున్న ఒక నిజ జీవిత ఉదంతం. జీవితంలో సాధించాలన్న తపన, సాధించేవరకు ఆగని కృషి; ఈ రెండు గుణాలే తనను నేడు విశిష్టమైన వ్యక్తిని చేసాయి.**

1990 సెప్టెంబర్ 19న జన్మించిన ఫణీంద్ర , చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, నిజాయితీ, విద్య పట్ల గౌరవం వంటి విలువలను అలవాటు చేసుకున్నారు.తండ్రి ముండ్రు అబ్రహం నిబద్ధత, తల్లి ముండ్రు మణి సహనం ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి.సోదరి మాతంగి రమ్యావిద్యాసాగర్ ఎల్లప్పుడూ అండగా నిలిచి, ప్రతి అడుగులో ప్రోత్సాహం అందించింది.ఈ కుటుంబ బంధమే ఆయన ప్రతి విజయానికి పునాది.

ఫణీంద్ర చిన్నప్పటి నుంచే కేవలం చదువు మీదే కాకుండా, సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తిని పెంపొందించుకున్నారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి, ఏ పని చేసినా నాణ్యతతో చేయాలనే పట్టుదల ఆయన విజయసుత్రాలు. ఈ విలువలు, ఆయన తల్లిదండ్రులు నేర్పిన జీవన సూత్రాలు, ఆయన ప్రతి నిర్ణయంలో ప్రతిఫలించాయి. ఫణీంద్ర తల్లిదండ్రులు ఎల్లప్పుడూ "ఏ పని చేసినా నాణ్యతతో చేయాలి" అనే సూత్రాన్ని బోధించారు. ఈ విలువలు ఆయన వ్యక్తిత్వానికి గట్టి పునాది వేశాయి.

బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్న సమయం నుంచే ఫణీంద్ర స్వతంత్రంగా పనిచేయడం మొదలుపెట్టారు. గూగుల్ ఆఫ్‌లైన్ అసైన్‌మెంట్లు చేసి, టెక్నాలజీ ప్రపంచాన్ని లోతుగా అర్థం చేసుకున్నారు. ఆ సమయంలోనే దేశ, విదేశాల కస్టమర్ల కోసం అనేక వెబ్‌సైట్లు డిజైన్ చేసి, సాంకేతిక నైపుణ్యాలలోనూ పట్టు సాధించారు. చదువుతో పాటు చేసిన ఈ ప్రాజెక్టులు ఆయనలో విశ్వాసాన్ని పెంచి, పెద్ద స్థాయి ప్రాజెక్టులను తీసుకునే ధైర్యాన్ని ఇచ్చాయి.



"రోజు పగలు కాలేజీ క్లాసులు, రాత్రి ప్రాజెక్టులు... నిద్రకన్నా నా కలలను నిజం చేసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించాను" అని ఆ రోజుల్ని గుర్తుచేసుకుంటూ ఫణీంద్ర చెబుతారు.


దాదాపు పదకొండు సంవత్సరాల కృషి, వ్యూహాత్మక ఆలోచన, మరియు నిరంతర శ్రమతో "దెనిసా టెక్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్" అనే సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపించారు.ఈ కంపెనీ కస్టమర్ అవసరాలను ముందుగానే అంచనా వేసి, సమయానికి వినూత్న పరిష్కారాలు అందించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ సంస్థ కస్టమ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ వంటి విభిన్న సేవలను అందిస్తూ, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విశ్వాసాన్ని సొంతం చేసుకుంది.

"కస్టమర్-ఫస్ట్" అనే సిద్ధాంతాన్నిఫణీంద్ర ప్రతి ప్రాజెక్ట్‌లో పాటిస్తారు. పారదర్శక విధానాలు, నాణ్యతకు ప్రాధాన్యత, మరియు సమయపాలనలో రాజీ పడని ధోరణి ఈ సంస్థ విజయానికి కారణమయ్యాయి. ఫణీంద్ర నాయకత్వం తో పాటు నాణ్యతతో కూడిన ప్రమాణాలు, బృందంపై నమ్మకం, సృజనాత్మకతకు ప్రోత్సాహం ; కంపెనీకి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చింది.

టెక్నాలజీ రంగంలో విజయాలను అందుకున్న తర్వాత, ఆటోమొబైల్ రంగంలో కూడా అడుగుపెట్టారు.తన భార్య స్రవంతితో కలిసి అబిగైల్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించారు.తమ కుమార్తె పేరుతోనే కంపెనీకి పేరు పెట్టడం ద్వారా వ్యాపారానికి కుటుంబ అనుబంధాన్ని జోడించారు.కస్టమర్ విశ్వాసం, పారదర్శక సేవలు, నాణ్యత ; ఇవే అబిగైల్ విజయానికి ప్రధానమైన మూలాలు.

ఫణీంద్ర మీడియా రంగంలో కూడా సమాంతరంగా ముందుకు సాగారు.తెలుగు దినపత్రిక సూర్యలో కార్పొరేట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ, పత్రిక నిర్వహణలో కొత్త విధానాలు తీసుకువచ్చారు.ఆయన దూరదృష్టి, వ్యూహాత్మక ఆలోచనలు పత్రికకు మార్కెట్‌లో కొత్త ఉత్సాహం నింపాయి. భార్య స్రవంతి వ్యాపార నిర్ణయాల్లో భాగస్వామ్యం అవుతూ, ప్రతి సందర్భంలో అండగా నిలిచారు.పిల్లలు అబిగైల్, మాల్విన్ అబ్రహం ఆయన ప్రతీ విజయానికి ప్రేరణ.వ్యాపార ఒత్తిడిలో కూడా కుటుంబంతో గడిపే సమయాన్ని ఫణీంద్ర అత్యంత విలువైనదిగా భావిస్తారు.









వ్యాపారాల్లో ఎప్పుడూ మార్పులు, పోటీలు, మరియు అనిశ్చితి సహజం. ఫణీంద్ర ఈ సవాళ్లను వెనుకడుగు వేయడానికి కారణంగా కాకుండా, కొత్త అవకాశాలుగా మలచుకున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభ దశలో నమ్మకం సంపాదించడం, క్లయింట్లను దీర్ఘ కాలంలో ఉండేలా చేయడం పెద్ద సవాల్. కానీ, ప్రతి ప్రాజెక్ట్‌ను సమయానికి, నాణ్యతతో పూర్తి చేయడం ద్వారా ఆ సవాలును అధిగమించారు. అందుకే క్రమంగా అంతర్జాతీయ క్లయింట్ల వరకు ఈ సంస్థ పరిధి విస్తరించింది.

ఆటోమొబైల్ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు కూడా కొత్త బ్రాండ్‌ను మార్కెట్‌లో స్థాపించడం అంత సులభం కాదు. పెద్ద కంపెనీల పోటీలో నిలవాలంటే ప్రత్యేకమైన సేవలు, వినూత్న ఆలోచనలు అవసరమని ఫణీంద్ర గుర్తించారు. కస్టమర్-సెంట్రిక్ దృక్పథం, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ రెండింటిలో సమగ్ర మార్కెటింగ్ వ్యూహం, మరియు కస్టమర్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మార్పులు చేర్పులు చేయడం ద్వారా "అబిగైల్ ఆటోమొబైల్స్"కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.

ఫణీంద్ర దృష్టిలో వ్యాపారం అంటే కేవలం లాభం కాదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సమాజానికి విలువైన మార్పులు తీసుకురావడం ఆయన ప్రధాన లక్ష్యాలు. "వ్యాపారం సమాజాన్ని బలోపేతం చేయగల వేదిక" అని ఆయన నమ్మకం.

మూడు విభిన్న రంగాల్లో విజయాన్ని సాధించడం సమయ నిర్వహణ మాత్రమే కాదు, ప్రతి రంగం ప్రత్యేకతను అర్థం చేసుకుని, సార్వత్రిక నాయకత్వ సూత్రాలను అన్వయించడం అవసరం. ఫణీంద్ర ప్రతి వ్యాపారంలో సమర్థమైన మేనేజ్మెంట్ టీమ్‌ను నిర్మించి, వారికి నిర్ణయాధికారాన్ని ఇచ్చి, వ్యూహాత్మక దిశను మాత్రం తనదైన శైలిలో చూపిస్తారు.

ఫణీంద్ర భవిష్యత్తులో మరిన్ని రంగాలలో తన వ్యాపార పరిధిని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సొల్యూషన్లపై దృష్టి సారించడం, ఆటోమొబైల్ రంగంలో ఎలక్ట్రిక్ వెహికల్ సర్వీసింగ్ మరియు కస్టమైజేషన్ విభాగాలను ప్రవేశపెట్టడం ఆయన ప్రణాళికలో ఉన్నాయి. అలాగే, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులపై మరింత దృష్టి పెట్టాలనుకుంటున్నారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, చిన్న వ్యాపారాలకు డిజిటల్ టూల్స్ అందించడం, మరియు పర్యావరణ స్నేహపూర్వక వ్యాపార మోడల్స్‌ను రూపొందించడం ఆయన భవిష్యత్ కార్యాచరణలో భాగం.



ముండ్రు ఫణీంద్ర జీవన ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయ గాథ కాదు , అది ఒక స్పష్టమైన సందేశం కూడా. పట్టుదల, కృషి, నిజాయితీ, మరియు స్పష్టమైన దిశ ఉంటే ఏ కల అయినా నిజం కావచ్చని ఆయన నిరూపించారు. విద్యార్థి దశలోనే అనుభవాన్ని సంపాదించడం నుంచి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థలను స్థాపించడం వరకు, ఆయన ప్రతి అడుగూ ప్రణాళికాబద్ధంగానే కాక, విలువలతో నిండినదే.తన కుటుంబం మద్దతుతో, తన సొంత శ్రమతో, విభిన్న రంగాలలో సుస్థిర స్థానం సంపాదించడమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా తన వ్యాపారాలను నడపడం ఆయన ప్రత్యేకత. భవిష్యత్తు కోసం ఆయన సాంకేతికతను, నూతన ఆలోచనలను, మరియు మానవీయ దృక్పథాన్ని మిళితం చేయాలనుకోవడం, ఆయనలోని దూరదృష్టిని సూచిస్తుంది.తరతరాలకు ప్రేరణగా నిలిచే ఈ ప్రయాణం, ప్రతి ఒక్కరికీ - "స్వప్నాలను కేవలం చూడకండి, వాటిని సాధించడానికి శ్రమించండి" అనే సత్యాన్ని గుర్తు చేస్తుంది.

Thenisa Tech Soft Solutions Pvt. Ltd.